క్లుప్తంగా

రైతుల ఇబ్బందులపై స్పందించిన అధికారులు



మొయినాబాద్ పీఏసీఎస్ కార్యాలయం ముందు వేసిన టెంటు

మొయినాబాద్: విత్తనాల కొనుగోలు కోసం వచ్చిన రైతులు ఎండలో ఇబ్బందులు పడటంపై వ్యవసాయాధికారులు స్పందించారు. మొయినాబాద్‌లోని పీఏసీఎస్ కార్యాలయం ముందు రైతులకు ఎండ తగలకుండా శుక్రవారం టెంటు వేయించారు. ఎండలో వచ్చే రైతుల దాహర్తి తీర్చడంకోసం మంచినీటిని సైతం అందుబాటులో ఉంచారు. పచ్చిరొట్ట పైరు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు విత్తనాలను తీసుకోవచ్చని మండల వ్యవసాయాధికారి రాగమ్మ తెలిపారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ రవీందర్ యాదవ్

కేశంపేట: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఎల్గనమోని రవీందర్ యాదవ్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటం వల్ల సర్వసభ్య సమావేశంలో ఎలాంటి చర్చ జరగకుండానే సాదాసీదాగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అజీంఅలీ, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్, ఎంపీటీసీలు సురేష్‌రెడ్డి, రాజు, బుజ్జిరాంచందర్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

3న మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీఓ సంధ్య

మొయినాబాద్‌రూరల్: మొయినాబాద్ మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 3వ తేదీ సోమవారం నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి సంధ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొయినాబాద్ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ నక్షత్రంజేవంత అధ్యక్షతన జరుగుతందని తెలిపారు. ఈ సమావేశం మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని సూచించారు. మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు, గ్రామాల అధికారులతో పాటు మండల అధికారులు హాజరుకావాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నియామక పత్రం అందజేస్తున్న కో ఆపరేటివ్ జిల్లా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు

షాబాద్: గీత కార్మికుల సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని ఎనుకున్నట్లు కో ఆపరేటివ్ జిల్లా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం తాళ్లపల్లి గ్రామంలో దాడిటాపర్ కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎనుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా తాళ్ల గణేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా తాళ్ల శ్రీనివాస్‌గౌడ్, డైరెక్టర్లుగా బండ రాంచంద్రయ్యగౌడ్, తాళ్ల నాగరాజ్‌గౌడ్, తాళ్ల శివకుమార్‌గౌడ్‌లను ఎనుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తాళ్ల నారాయణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన చేవెళ్ల ఎమ్మెల్యే



కేసీఆర్‌ను కలిసిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: మాజీ సీఎం కేసీఆర్‌ను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని సూచించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వెంట నియోజకవర్గం నాయకులు ఉన్నారు.

సేంద్రియ వ్యవసాయమే మేలు

- రసాయనిక ఎరువులతో పెరుగుతున్న ఖర్చులు
- భూసారం తగ్గి పంటల దిగుబడిపై ప్రభావం
- సేంద్రియ సాగుపై అవగాహన కరువు
- నష్టాల బారిన రైతులు
- పట్టించుకోని అధికారులు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న రసాయన మందులు

కాకునూర్‌లో సేంద్రియ ఎరువుల తయారిపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కేశంపేట: యాసంగి సీజన్ ప్రారంభమైంది. వ్యవసాయ పనులు గ్రామాల్లో చురుగ్గా సాగుతున్నాయి. రైతులు భూములను చదును చేస్తూ, దుక్కులు దున్ని పంట సాగుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. సేంద్రియ వ్యవసాయంపై అవగాహనలేక పోవడంతో రసాయన ఎరువుల సాగుకే మొగ్గు చూపుతున్నారు. రసాయన ఎరువులతో పంటలను సాగుచేయడం వల్ల పెట్టుబడి వ్యయం పెరిగి రైతులు ఆశించిన స్థాయిలో దిగుబడి రాక నష్టపోతున్నారు. సేంద్రియ వ్యవసాయం చేయడం వల్ల పంటల వ్యయం తగ్గి రాబడి పెరుగుతుంది.

రసాయనాలతో నష్టం

రసాయన ఎరువుల వాడకంతో భూసారం తగ్గిపోతుంది. సరైన దిగుబడి రాదు. ముఖ్యంగా రైతు సాగుపై పెట్టే పెట్టుబడి ఖర్చు పెరుగుతుంది. భూమి సాంద్రతను కోల్పోతుంది. పురుగు మందులను పిచికారి చేయడం వల్ల పర్యావరణంలో కూడా మార్పులు వస్తాయి. భూ సారం తగ్గి రసాయనాల వినియోగం రోజు రోజుకు పెరుగుతుంది. భూసారం తగ్గడం వల్ల పంటలకు రోగనిరోధకశక్తి తగ్గి చీడపీడల ఉధృతి పెరుగుతుంది.

చీడ, పీడల బెడద తగ్గుతుంది

సేంద్రియ ఎరువుల వాడకంతో పంటలకు చీడ, పీడల బెడద తగ్గి, అధిక దిగుబడులు సాధించవచ్చు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభలు పొందే అవకాశం ఉంది. పెట్టుబడి వ్యయం కూడా తగ్గడం వల్ల భూమి జవసత్వం పెరుగుతుంది. పర్యావరణానికి ఎలాంటి హాని జరుగదు. సేంద్రియ ఎరువులు అరుతడి పంటలకు, కూరగాయలకు ఎంతో మేలు కలిగిస్తాయి.

సేంద్రియ ఎరువుల తయారీ విధానం

సేంద్రియ ఎరువుల తయారీ విధానం ప్రకృతి సిద్ధంగా ఉంటుంది. ఆకులు, అలములు, చెత్త, పశువుల పేడ, ఆవు మూత్రంతో కలిసి జీవామృతం తయారు చేసుకోవాలి. దీనిని పొలంలో చల్లుకోవచ్చు లేదా స్ప్రే చేసుకోవచ్చు. దశపత్రి, కాషాయం, వివిధ రకాల ఆకులతో కలిపి పురుగులను చంపేందుకు రసాయనం తయారు చేసుకోవచ్చు. పంట పొలాల వద్ద రైతులు తమకు అనుకూలమైన ప్రదేశంలో ఆకులు, ఇతర వ్యర్థపదార్థాలను వేసి దానిపై పశువుల పేడతో సేంద్రియ ఎరువును తయారు చేసుకోవచ్చు. ప్రభుత్వం సబ్సిడీపై పచ్చిరొట్ట పంటలైన జనుము, జీలుగలను అందిస్తుంది. రైతులు దీనిని వాడటం వల్ల భూమి సారవంతం పెరుగుతుంది. పశువుల పేడతో జీవన ఎరువులను కలిపి సేంద్రియ ఎరువును తయారు చేసుకోవచ్చు.

భూసారం పెరుగుతుంది



గ్రామాల్లో రైతులకు సేంద్రియ వ్యవసాయంపై వ్యవసాయశాఖ అవగాహన కల్పించాలి. వ్యవసాయంలో రసాయనిక ఎరువుల వాడకమే అధికంగా ఉంది. సేంద్రియ ఎరువుల తయారికి ప్రతీ రైతు ముందుకు రావాలి. సేంద్రియ వ్యవసాయం చేయడం వల్ల భూసారం కూడా పెరుగుతుంది.

– చింతల వెంకటిరెడ్డి, నిర్ధవెళ్లి గ్రామం, కేశంపేట

అవగాహన కల్పించాలి



రసాయనిక ఎరువుల వాడకం వలన భూసారం తగ్గిపోతుంది. దీంతో పంటలకు చీడ, పీడల బెడద అధికం అవుతుంది. గ్రామాల్లో సేంద్రియ ఎరువుల వాడకం గూర్చి రైతులకు వ్యవసాయశాఖ అవగాహన కల్పించాలి. రైతులు సేంద్రియ ఎరువుల వాడకం వైపు దృష్టి సారించాలి.

–మల్తాంకార్ అఖిల్, బైర్కాన్‌పల్లి, కేశంపేట

సేంద్రియాలే ఉత్తమం



సేంద్రియ ఎరువులే పంటల సాగుకు ఉత్తమం. వీటిని ఉపయోగిస్తే పంటలు అధికంగా పండటంతో పాటు మంచిపోషకాలు కలిగిన పంట రాబడిని అందిస్తాయి. కాని సేంద్రియ వ్యవసాయంపై అవగాహన లేకపోవడంతో రైతులు ఎవరూ ఆసక్తి కనబర్చడం లేదు.

– వినయ్, మండల వ్యవసాయ విస్తరణ అధికారి, అల్వాల క్లస్టర్, కేశంపేట

కేసుల పరిష్కారానికే లోక్ అదాలత్

రిటైర్డు జడ్జి సాంబశివరావు



లోక్ ఆదాలత్‌లో రిటైర్డు జడ్జి సాంబశివరావు

చేవెళ్ల: పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్‌లు ఉపయోగపడుతాయని వీటిని సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డు జడ్జి సాంబశివరావు అన్నారు. చేవెళ్ల కోర్టు ఆవరణలో శుక్రవారం చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెండింగ్ కేసులపై లోక్‌అదాలత్ నిర్వహించారు. చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్ పరిధిలోని కేసులను పరిష్కరించారు. 82 మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులు పరిష్కరించబడినట్లు సాంబశివరావు తెలిపారు. చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన ట్రాఫిక్ కేసులను వాహనదారులు సత్వరమే పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ లోక్‌అదాలత్‌లను వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ఎస్ఐ విఠల్‌రెడ్డి, ట్రాఫిక్ సిబ్బంది, కోర్టు సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు



ర్యాలీలో పాల్గొన్న ఆరోగ్య సిబ్బంది

షాద్‌నగర్: పొగాకు ఉత్పత్తులకు అందరు దూరంగా ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. అంతర్జాతీయ పొగాకు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పట్టణంలోని ఇంద్రానగర్, తిరుమల కాలనీలో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పొగత్రాగడం వల్ల క్యాన్సర్ బారిన పడే అవకాశాలు అధికంగా ఉంటాయన్నారు. ప్రజలెవరు బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయకూడదని హెచ్చరించారు. ప్రస్తుతం చాలా మంది పొగాకు వాడడం వల్ల తీవ్ర అనారోగ్య సమస్యలకు గురవుతున్నారన్నారు. పొగతాగే వారికే కాకుండా వారి చుట్టూ ఉన్న వారిని కూడా ప్రభావితం చేస్తుందన్నారు. డాక్టర్ జగదీశ్వర్ మాట్లాడుతూ పొగాకు ప్రాణాంతకం అని తెలిసినా చాలా మంది ధూమపానానికి బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పొగాకు వాడకం వివిధ రూపాల్లో జరుగుతుందన్నారు. ప్రధానంగా పొగ రూపంలో పీల్చి, వదలడం నేటి యువతకు ఫ్యాషన్‌గా మారిందని అన్నారు. సిగిరెట్, బీడీ, చుట్టా, హుక్కా పీల్చడం ప్రాణాంతకంగానే మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ, హెల్త్ సూపర్ వైజర్లు శ్రీరామ, చంద్రకళ, గౌస్, రవికుమార్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కాలుష్యం నుంచి కాపాడండి

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి



రఘుకు వినతిపత్రం అందజేస్తున్న స్వామి, గ్రామరైతులు

షాబాద్: పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యం నుంచి ప్రజలను, రైతులను కాపాడాలని షాబాద్ మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని పొల్యూషన్ కంట్రోల్ మెంబర్ రఘుకు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందనవెళ్లి గ్రామ సమీపంలో ఓ ప్రైవేటు పరిశ్రమ మధ్యరాత్రి పొగ వదలడంతో గాలిలో కలిసి కాలుష్యం అవుతుందన్నారు. ఈ పొగను సమీప గ్రామస్తులు పీల్చడంతో రోగాల బారిన పడుతున్నారన్నారు. దీంతో గ్రామంలో చిన్నపిల్లలు, వయో వృద్ధులు, దమ్ము, శ్వాస సబంధిత వ్యాధులకు గురవుతున్నారని తెలిపారు. ఈ పొగ వల్ల వ్యాధుల బారిన పడడమే కాకుండా చుట్టు ప్రక్కల గ్రామాల రైతులు పొలం పనులు చేయలేక పోతున్నారని వివరించారు. పరిశ్రమ నుంచి వెలువడుతున్న కాలుష్యంపై తగు చర్యలు తీసుకోవాలని కంపెనీ ప్రతినిధులకు వివరిచారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాంచందర్‌రావు, ఆంజనేయులు, వడ్ల రాఘవాచారి, గోపాల్, కిష్టయ్య, మహేందర్‌రెడ్డి, నరేశ్, రంగయ్య, సత్తయ్య, సుధాకర్‌రెడ్డి, మల్లేశ్, యాదగిరి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోగాలు రాకుండా జాగ్రత్తలు తప్పనిసరి

పశువైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి



టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

షాబాద్: పశువులకు ఎలాంటి రోగాలు రాకుండా రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని సర్దార్‌నగర్, కుమ్మరిగూడ గ్రామాల్లో పశువులకు గొంతువాపు వ్యాధి, తొడవాపు వ్యాధి నివారణకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువుల ఆరోగ్యం పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గొర్రెలు, మేకలు అనారోగ్యానికి గురికాకుండా ప్రభుత్వం ఏడాదిలో రెండు విడతలు చిటుక వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం చేపడుతుందన్నారు. దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబానికి అండగా ఉంటాం

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శ్రీధర్‌రెడ్డి, తదితరులు

షాబాద్: ప్రమాదంలో మృతి చెందిన కుటుంబానికి అండగా నిలుస్తామని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని బొబ్బిలిగామ గ్రామంలో రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆవుల మల్లేశ్, నవనీత దంపతుల కుటుంబాన్ని పరామర్శించారు. వారికి ఆర్థిక సహాయం అందజేశారు. బొనగిరిపల్లి గ్రామ నాయకులు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. తల్లిదండ్రులు లేని ఇద్దరు పిల్లలను చిల్కూర్ ఎన్టీఆర్ స్కూల్‌లో డిగ్రీవరకు ఉచితంగా చదివిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భార్య భర్తల మృతితో ఆ కుటుంబం పెద్ద దిక్కుని కోల్పోయిందన్నారు. ఆ కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నరేశ్, మహేందర్, మహేష్, రవిగౌడ్, రాజు, ఎల్ మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లల్లో తనిఖీలు చేపట్టాలి

సీపీఎం మండల కన్వీనర్ గోపాల్

కొందుర్గు: హోటళ్ల యజమానులు నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని వెంటనే తనిఖీలు చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కన్వీనర్ రాయికంటి గోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తినే పదార్థాల్లో ఈగలు, దోమలు వస్తున్నాయని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం లేదని ఆయన ఆరోపించారు. దీంతో హోటళ్లలో తినాలంటేనే జంకుతున్నారని పేర్కొన్నారు.

పెంజర్ల కూడలి మూసివేత

కొత్తూరు: కొత్తూరు పట్టణంలోని జాతీయ రహదారిపై ఉన్న పెంజర్ల కూడలిని ప్రమాదాల నివారణలో భాగంగా శుక్రవారం నుంచి మూసివేశారు. పట్టణం నుంచి పెంజర్ల, సిద్దాపూర్‌తో పాటు పలు గ్రామాలకు వెళ్లే వాహనదారులు వై జంక్షన్, తిమ్మాపూర్ నుంచి యూ టర్న్ తీసుకోవాలని స్థానిక పోలీసులు సూచిస్తున్నారు. మరికొన్ని రోజుల్లో వై జంక్షన్ కూడలిలో నిర్మించిన అండర్ పాస్ అందుబాటులోకి వస్తే పెంజర్ల, సిద్దాపూర్‌తో పాటు ఆయా గ్రామాలకు వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు తప్పుతాయన్నారు. ఇటీవల కాలంలో జాతీయ రహదారిపై ఉన్న చేగూరురోడ్డు, వై జంక్షన్, పెంజర్ల కూడళ్లలో ప్రమాదాలు చోటు చేసుకొని వాహనదారులు మృతి చెందడంతో కూడలిని తాత్కాలికంగా మూసివేసినట్లు సీఐ నర్సింహ్మారావు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మొయినాబాద్: అమ్డాపూర్, నాగిరెడ్డిగూడ, వెంకటాపూర్, అజీజ్‌నగర్, చాకలిగూడ, మేడిపల్లి, వీరన్నపేట్, రెడ్డిపల్లి గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ అధికారులు హమునాయక్, రాజేష్‌బాబు తెలిపారు. విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శ్రీనిధి, వెంకటాపూర్, మేడిపల్లి, రెడ్డిపల్లి ఫీడర్ల పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి 1.30వరకు, నాగిరెడ్డిగూడ, అమ్డాపూర్, వీరన్నపేట్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పాముల నుంచి జాగ్రత్త!

- వర్షాకాలంలో సర్పాల బెడద ఎక్కువ
- పశువులను కాటేస్తే సకాలంలో గుర్తించాలి
- డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పశు వైద్యాధికారి



షాబాద్: వర్షాకాలంలో పాముల బెడద ఎక్కువగా ఉంటుంది. పశువులు మేత కోసం బీడు భూములు, అడవుల్లోకి వెళ్లినప్పుడు పాములు కాటేసే ప్రమాదం ఉంది. ఇలాంటప్పుడు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. చెట్ల పొదల్లో, పంట పొలాల వద్ద పాములు ఎక్కువగా కనిపిస్తుంటాయి. పశువులను మేత కోసం బీడు భూములు, అడవుల్లోకి వదిలినప్పుడు పాములు కాటేసే ప్రమాదం ఉంది. నోరు లేని జీవాలు కాబట్టి పాము కరిస్తే రైతులు, కాపర్లు సకాలంలో గుర్తించాలి. లేదంటే అవి మృత్యువాత పడతాయి.

రక్త పింజరతో...

రక్త పింజర కాటు వేస్తే హిమోటాక్సిన్ విడుదలయ్యి రక్త ప్రసరణ వ్యవస్థపై ప్రభావం పడుతుంది. దీంతో పశువుల నోరు, ముక్కుల నుంచి రక్తం కారుతుంది. పాము కాటు వేసిన దగ్గర మంటగా ఉంటుంది. కాటు వేసిన చోట వాపు వచ్చి చర్మం రంగు మారుతుంది. మూత్రం ఎరుపు రంగులో వస్తుంది. రక్తపింజర కాటు బారిన పడిన పశువులు పది గంటల లోపు మృత్యువాత పడుతాయి.

తాచుపాము, కట్లపాములు....

తాచుపాము, కట్లపాము కరిచినప్పుడు న్యూరోటాక్సిన్ పశువుల శరీరంలోకి వెళ్లి నాడీ మండల వ్యవస్థపై ప్రభావం పడుతుంది. దీంతో శ్వాసకోస వ్యవస్థ స్తంభిస్తుంది. పాము కరిచిన చోట మంట ఉండదు, కాని నోటి నుంచి నురగ వస్తుంది. పశువులు అపస్మారక స్థితిలోకి వెళ్తాయి. సరైన సమయంలో చికిత్స నిర్వహించ కపోతే మృతి చెందుతాయి.

చికిత్సలు

పశువును పాము కరిచిన చోట గుడ్డతో గట్టిగా కట్టాలి. కాటేసిన చోట బ్లేడుతో కోసి రక్తం పిండి వేయాలి. ప్రతి 20 నిమిషాలకు ఒక సారి కట్టును వదులు చేస్తూ మళ్లీ కట్టాలి. ఇలా చేయడంతో విషం పైకి ఎక్కకుండా ఉంటుంది. పామ్ ఆట్రోసిన్ సల్ఫేట్, ఏవిల్ ఇంజక్షన్లు పశువు రక్త నాళాల్లోకి ఎక్కించాలి. యాంటీ బయోటిక్స్, అనాలెజిక్స్, కార్టికోస్టిరియాడ్స్, గ్లూకోజ్ లాంటి మందులు అవసరాన్ని బట్టి ఇస్తుండాలి. శ్వాసక్రియ ఉత్తేజం చేయడానికి కొరమిడ్, నికాతమైడ్ లాంటి ఇంజక్షన్లు ఇవ్వాలి. పాముకాటు వేస్తే త్వరగా స్పందిస్తే మేలు.

వెంటనే గుర్తించాలి



పాము కరిచిన వెంటనే గుర్తించాలి. లేదంటే ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. పాము కరిచిన చోట గుడ్డతో గట్టిగా కట్టాలి. కాటేసిన చోట బ్లేడుతో కోసి రక్తం పిండి వేయాలి. ప్రతి 20 నిమిషాలకు ఒక సారి కట్టును వదులు చేస్తూ మళ్లీ కట్టాలి. ఇలా చేయడంతో విషం పైకి ఎక్కకుండా ఉంటుంది. వెంటనే పశు వైద్యుడిని సంప్రదించి చికిత్సలు చేయించాలి.

–డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, పశు వైద్యాధికారి, రేగడి దోస్వాడ

ఎరువులు, విత్తన దుకాణాల్లో తనిఖీలు



చేవెళ్ల: తనిఖీలు నిర్వహిస్తున్న తహసీల్దార్ కృష్ణయ్య, ఎస్ఐ వీరబ్రహ్మం



శంకర్‌పల్లిలో విత్తన ప్యాకెట్లను తనిఖీ చేస్తున్న అధికారులు

చేవెళ్ల: రైతులకు నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే సీడ్స్ దుకణాలపై కఠిన చర్యలు ఉంటాయని చేవెళ్ల తహసీల్దార్ క్రిష్ణయ్య, ఎస్ఐ వీరబ్రహ్మం, ఏఓ తులసీ పేర్కొన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని పలు సీడ్స్ దుకాణాలను శుక్రవారం మండల టాస్క్‌ఫోర్స్ టీమ్ వ్యవసాయశాఖతో సంయుక్తంగా కలిసి తనిఖీలు నిర్వహించారు. తహసీల్దార్ కృష్ణయ్య, ఎస్ఐ వీరబ్రహ్మం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేశ్, వ్యవసాధికారులు సంయుక్తంగా తనిఖీలు చేశారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. రైతులకు ఎట్టి పరిస్థితుల్లో విత్తనాల కొరత సృష్టించొద్దన్నారు.

షాద్‌నగర్: డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రామిరెడ్డి, మండల వ్యవసాయ అధికారి నిషాంత్‌కుమార్, డిప్యూటీ తహిసీల్దార్ ఆనంద్‌సింగ్ ఎరువులు, విత్తనాల దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. గోదాములను, ఈ పాస్ యంత్రాలను, తనిఖీ చేశారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని సూచించారు. ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువగా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఏఈఓ తేజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విత్తనాలను అమ్మాలని శంకర్‌పల్లి వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ అధికారులు సూచించారు. శంకర్‌పల్లి పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో మండల వ్యవసాయాధికారి సురేశ్ బాబు, డిప్యూటీ తహసీల్దార్ ప్రియాంక, ఎస్ఐ సంతోష్‌రెడ్డి సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ దుకాణదారులు విత్తనాల వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు.

కొందుర్గు: నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏడీఏ రాజారత్నం హెచ్చరించారు.



షాద్‌నగర్: విత్తనాలు, ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

తహసీల్దార్ రమేష్ సమక్షంలో కొందుర్గు మండలంలో ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శివకుమార్, ఏఈఓ వాసవి పాల్గొన్నారు.

కేశంపేట: మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో రెవెన్యూ, పోలీస్, వ్యవసాయశాఖ సంయుక్త అధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. స్టాకు, రికార్డులను వారు పరిశీలించారు. విత్తనాలను కొనుగోలు చేసే రైతులకు రసీదులను ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ గీత, ఐఎస్ఐ లింగం, మండల వ్యవసాయ అధికారి శిరీష ఉన్నారు.

కొత్తూరు: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ నర్సింహ్మారావు హెచ్చరించారు. టాస్క్‌ఫోర్స్ టీంతో కలిసి ఆయన మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి వ్యాపారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జంగయ్య, మండల వ్యవసాయ అధికారి గోపాల్, ఎస్ఐ శ్రీనివాస్, వ్యాపారులు, తదితరులు పాల్గొన్నారు.